


# మనం
## మెదక్ సంగారెడ్డి సిద్దిపేట





మంగళవారం | 17 | అక్టోబర్ | 2023 | పేజీలు : 8






## పురిటిగడ్డకు
# మట్టిబిడ్డ

- లక్ష మందితో జనగర్జన
- నినాదాలు నిజమైన వేళ
- ఎదురు చూస్తున్న సిద్దిపేట జనం
- అదిరిపోయిన ఏర్పాట్లు
- పనులను పర్యవేక్షించిన మంత్రి హరీష్‌రావు

సిద్దిపేట, అక్టోబర్ 16, మనం న్యూస్ ప్రతినిధిః సిద్దిపేట పురిటిగడ్డకు ప్రజా ఆశీర్వాద సభ పేరుతో సిద్దిపేటలో నిర్వహిస్తున్న జనగర్జనకు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి, బిఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ రానున్నారు. సాయంత్రం 4:45 గంటలకు సిద్దిపేట పరిధిలోని శివాజీ చౌక్ సమీపంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొననున్నారు. ఒకనాటి నినాదాలన్నీ నిజమైన వేళ అభివృద్ధిలో రాష్ట్రానికే రోల్ మోడల్‌గా నిలుస్తున్న సిద్దిపేటకు మట్టిబిడ్డ మిగతా 2లో..

# ఒక్కటి తక్కువైంది



దుబ్బాక/దుబ్బాక టౌన్, అక్టోబర్ 16, మనం న్యూస్ః ఒక్కటి తక్కువెంది... అవును...! దుబ్బాక నియోజకవర్గ అసెంబ్లీ ఎన్నికల బరిలో దిగేందుకు ఒకే ఒక్క పార్టీ తక్కువైంది. ప్రధాన పార్టీలుగా ఉన్న బీజేపి, బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలలో బిఆర్ఎస్ పార్టీ అధిష్టానం దుబ్బాక అసెంబ్లీ



అభ్యర్థిగా మెదక్ ఎంపి కొత్త ప్రభాకర్ రెడ్డిని ఖరారు చేసింది. అయితే భారతీయ జనతా పార్టీ ఇంత వరకు అభ్యర్థుల జాబితాను ప్రకటించకపోయినప్పటికీ ఇప్పటికే దుబ్బాక మిగతా 2లో..

- -రెండు రెడీ.... మిగిలింది ఒక్కటే
- -దుబ్బాకలో తగ్గేదే లే....
- -పందానికి సై అంటున్న పార్టీలు
- -వజ్రాయుధంతో సిద్ధంగా ఉన్న ఓటర్లు



# పురిటిగడ్డకు మట్టిబిడ్డ







మొదటి పేజీ తరువాయి..

కేసీఆర్ రానుండడంతో యావత్ జనమంతా ఉత్సుకతో ఎదురు చూస్తున్నారు. ఆరు పర్యాయాలుగా అంతకంతకూ మెజార్టీతో గెలుస్తూ వస్తున్న మంత్రి హరీష్‌రావు ఏడవసారి అసెంబ్లీ ఎన్నికల బరిలో దిగుతుండగా హరీష్‌రావును ఆశీర్వదించాలని నిర్వహించనున్న సభకుహాజరవుతున్న కేసీఆర్ అద్భుత స్వాగతం పలికేందుకు అంతా రెడీ అయింది. సిద్దిపేట నియోజకవర్గం నుండే లక్ష మందితో సత్తాను చాటి న భూతో న భవిష్యత్ అన్న రీతిలో సభను విజయవంతం చేసేందుకు మంత్రి హరీష్‌రావు శ్రేణులను సన్నద్ధం చేశారు. మంగళవారం నాడు జరగనున్న సభకు ఎలాంటి లోటుపాట్లు ఉండకుండా, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సభకు వచ్చిన వారికి ఎలాంటి ఆటంకం కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. 20 వేల మంది విద్యార్థులు, యువకులు బైక్ ర్యాలీతో సభా స్థలికి చేరుకోనుండగా పెద్ద సంఖ్యలో మహిళలు, ప్రజలు కాలినడక ద్వారా సభాస్థలికి చేరుకునేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. బతుకమ్మలు, కోలాటాలతో డిజే సౌండ్‌ల మోతల మధ్య గతంలో ఎప్పుడూ లేని విధంగా కేసీఆర్‌ను మరోసారి దీవించేందుకు హరీష్ రావును అఖండ మెజార్టీతో గెలిపించేందుకు కార్యోన్ముఖులు కానున్నారు.

**ముమ్మాటికీ హ్యాట్రిక్ బిఆర్ఎస్‌దే**

ఎవరెన్ని జిమ్మిక్కులు చేసినా, ఎవరెన్ని మ్యాజిక్కులు చేసినా ముమ్మాటికీ వచ్చేది బిఆర్ఎస్ సర్కారేనని, హ్యాట్రిక్ సాధించడం పక్కా అని మంత్రి హరీష్‌రావు అన్నారు. ప్రజా ఆశీర్వాద సభ పేరుతో నిర్వహిస్తున్న సభ ఏర్పాట్లను మంత్రి హరీష్‌రావు పరిశీలించి విలేకర్లతో మాట్లాడారు. కాంగ్రెస్, బీజేపిలకు టికెట్లు రావాలన్నా, పదవులు కావాలన్నా చివరకు ప్రజలు ఓట్లు వేయాలన్నా ఢిల్లీ నుండి వారి నేతలు రావాల్సిందేనని, బిఆర్ఎస్‌కు మాత్రం ప్రజలే బాస్‌లు అన్నారు. సంపద పెంచాలి... పేదలకు పంచాలి అనే స్కీమ్‌తో బిఆర్ఎస్ ముందుకు పోతుంటే కర్ణాటకలో ఇటీవల గెలిచిన కాంగ్రెస్ స్కామ్‌లతో అబాసుపాలవుతుందన్నారు. ముమ్మాటికీ బిఆర్ఎస్‌కు ఆగర్భశత్రువు బీజేపియే అన్నారు. స్వయంగా ప్రధాని ఎన్నోసార్లు రాష్ట్ర విభజనను ఉదహరిస్తూ తల్లిని, బిడ్డను వేరు చేశారంటూ తన అక్కసును వెల్లగక్కారన్నారు. వెనుకబడిన జిల్లాలకు ఇవ్వాల్సిన రూ.15 వేల కోట్లు ఆపినా, మోటార్లకు మీటర్లు పెట్టలేదని 30 వేల కోట్లు ఇవ్వకున్నా ప్రజల కోసం మరింత శ్రద్ధతో పని చేస్తున్నారన్నారు. ఏమీ పని చేయడం లేదంటూ బీజేపి నేతలు మాట్లాడుతుంటే సిగ్గనిపిస్తుందన్నారు. మేము ఏ పని చేయకుంటే మా పథకాలు ఎందుకు కాపీ కొడుతున్నారు అని, ఏ విభాగంలో అయినా ఢిల్లీలో జాతీయ స్థాయిలో అవార్డులు ఎందుకు ఇస్తున్నారన్నారు. ఢిల్లీలో అవార్డులిస్తూ పార్లమెంట్‌లో ప్రశంసలు చేస్తూ, తెలంగాణ గల్లీలోకి వచ్చి లొల్లి పెడుతున్నారని, ఇదేం పద్ధతి అన్నారు. ఇతర రాష్ట్రాలు తెలంగాణ పథకాలను కాపీ కొట్టేలా ట్రెండ్ సెట్ చేసింది కేసీఆర్ కాదా అని.. ఒక్కసారి ఆలోచించాలన్నారు. ఒక్కసారి అవకాశమంటూ పొర్లుదండాలు పెడుతున్న కాంగ్రెస్‌కు గతంలో 11 సార్లు అవకాశం ఇచ్చారని, వారు ఏం చేయడం లేదనే ప్రజలంతా బిఆర్ఎస్ వెంట ఉంటున్నారన్నారు. కాంగ్రెస్ పథకాలు కాపీ కొడుతున్నారని రేవంత్ మాట్లాడుతుంటే ఏంచేయాలో అర్థం కావడం లేదని, ఎక్కడా లేని విధంగా రైతుబంధును రూపొందించింది కేసీఆర్ కాదా...? ఒకనాడు ముక్కిమూల్గి రూ.200లు ఇచ్చిన పింఛన్‌ను రూ. 2 వేలు చేసింది కేసీఆర్ కాదా అన్నారు. నమ్మకానికి కేసీఆర్ మారుపేరైతే నమ్మకద్రోహానికి కేరాఫ్ అడ్రస్ కాంగ్రెస్ అన్నారు. సిద్దిపేటలో నిర్వహించనున్న బహిరంగ సభకు కవులు, కళాకారులు, మేధావులు, మహిళలు, విద్యార్థులు, యువకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాల్సిందిగా కోరారు.

---

# ఒక్కటి తక్కువైంది.....

మొదటి పేజీ తరువాయి..

సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న మాధవనేని రఘునందన్‌రావుకే దుబ్బాక సీటు కేటాయిస్తుండ నడంలో ఎలాంటి సందేహం లేదు. ఇదిలా ఉండగా ఇక మిగిలిన కాంగ్రెస్ పార్టీలో ముగ్గురు ఆశావహులు దుబ్బాక నుండి కాంగ్రెస్ తరుపున బరిలో నిలిచేందుకు సిద్ధంగా ఉండడంతో దుబ్బాక కాంగ్రెస్ సీటు ఎవరికి కేటాయిస్తారోనని ఇప్పుడు ప్రస్తుతం దుబ్బాక నియోజకవర్గ వ్యాప్తంగా అందరి మదిలో మెదులుతున్న ప్రశ్న. ఎంతో కాలంగా కాంగ్రెస్ పార్టీలో ఉంటూ అధిష్టానం పిలుపు మేరకు ప్రతి కార్యక్రమాన్ని చురుకుగా నిర్వహించుకుంటూ వచ్చిన చెరుకు శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర, జాతీయ స్థాయి నేతలతో ఉన్న అనుబంధంతోపాటు టిపిసిసి సభ్యులుగా ఉన్న పన్యాల శ్రవణ్‌కుమార్‌రెడ్డి, మరో వైపు కొంత కాలం క్రితమే కాంగ్రెస్ పార్టీలో చేరి బిసి బహుజన ఆడబిడ్డగా నియోజకవర్గంలో చొచ్చుకుపోయిన కత్తి కార్తీకలు కాంగ్రెస్ పార్టీ తరుపున దుబ్బాక బరిలో నిలిచేందుకు తమకు తోచిన విధంగా పార్టీ అధిష్టానంతోపాటు ముఖ్య నాయకులతో పావులు కదుపుతున్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా ఒకప్పుడు టీఆర్ఎస్‌కు కంచుకోటగా ఉన్న దుబ్బాక నియోజకవర్గాన్ని తిరిగి చేజిక్కించుకునేందుకు బిఆర్ఎస్ పార్టీ, అనివార్య కారణాల వల్ల జరిగిన మధ్యంతర ఎన్నికల ద్వారా అధికారంలోకి వచ్చిన బీజేపి మరోసారి దుబ్బాకపై పాగా వేసేందుకు ప్రయత్నాలు చేస్తుండగా, ఎలాగైనా సరే లేటుగా వచ్చినా లేటెస్ట్‌గా వస్తామంటూ బిఆర్ఎస్, బీజేపిలను ఓడించి హస్తగతం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గంలో తగ్గేదే లే.... అన్నట్టుగా తమ కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే బిఆర్ఎస్, బిజేపి పార్టీల అభ్యర్థులు ఖరారు కావడంతో దుబ్బాక బిఆర్ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డి నియోజకవర్గంలోని ఆయా మండలాల్లో వివిధ పార్టీల నుండి బిఆర్ఎస్‌లోకి చేరికలు జరిపి పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా, కార్యకర్తల్లో పార్టీ గెలుపుపై ఆశలు నింపే ప్రయత్నాలు చేస్తుండగా సిట్టింగ్ ఎమ్మెల్యే బీజేపి అభ్యర్థి రఘునందన్‌రావు ఏకంగా ప్రచార రథాన్నే సిద్ధం చేసుకొని నియోజకవర్గ వ్యాప్తంగా ప్రతి రోజు ఏదో ఒక మండలం నుండి భారీగా బీజేపిలోకి వలసలు పెరిగేలా ప్రణాళికలు సిద్ధం చేస్తూ నిత్యం పార్టీ కండువాలు కప్పుతూ బీజేపి పార్టీని దుబ్బాక నియోజకవర్గంలో బిఆర్ఎస్‌కు చాపకింద నీరులా మారుస్తూ బిజీ బిజీగా గడుపుతున్నారు. ఈవిధంగా బీజేపి, బిఆర్ఎస్ పార్టీలు రెండూ ఎన్నికలకు రెడిగా ఉన్నప్పటికీ అభ్యర్థి ఖరారు కాకపోవడంతో కాంగ్రెస్ పార్టీ మాత్రం కాసింత వెనుకబడిందనే చెప్పుకోవచ్చు. మొన్నటి వరకు చెరుకు శ్రీనివాస్‌రెడ్డి, పన్యాల శ్రవణ్‌కుమార్‌రెడ్డి, కత్తి కార్తీక గౌడ్‌లు ఎవరికి వారుగా ప్రజల్లోకి వెళ్లినప్పటికీ ఇటీవలి కాలంలో ముగ్గురిలో ఎవరు కూడా ప్రజాక్షేత్రంలో కనిస్తుండకపోయినప్పటికీ ఎవరికి వారుగా అంతర్గతంగా తమతమ వర్గాలతో ప్రజల్లో చొచ్చుకుపోయే ప్రయత్న చేస్తూనే ఉన్నట్లు సమాచారం. కాగా కాంగ్రెస్ దుబ్బాక అధిష్టానం సీటు ఎవరికి కేటాయిస్తుందేమోననే ప్రశ్న పార్టీ టికెట్ ఆశిస్తున్న ఆశావహులను సైతం నిత్యం నిద్రపట్టకుండా చేస్తుందనే చెప్పుకోవచ్చు.

**పందానికి సై....** రాష్ట్రంలో బిఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉండగా, దుబ్బాక నియోజకవర్గంలో మాత్రం కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపి పార్టీ అభ్యర్థి ఎమ్మెల్యేగా ఉండడంతో ఈసారి పోరుకు ఇరు పార్టీలు సై అంటున్నాయి. ఉప ఎన్నికల అనంతరం దుబ్బాక నియోజకవర్గంలో జరిగిన ఏ అభివృద్ధి కార్యక్రమమైనా ముందుగా ఉలిక్కిపడి అటెన్షన్‌తో ఉండేది పోలీస్ శాఖ. మరి ఆ రేంజ్‌లో అటు బిఆర్ఎస్ కార్యకర్తలు, ఇటు బీజేపి కార్యకర్తలు ఒకరిని మించి ఒకరు నినాదాలు చేసుకుంటూ అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న సంఘటనలు ఎన్నో ఉండగా కొన్నిసార్లు పరిస్థితులు ఒకరినొకరు కొట్టుకునే స్థాయికి కూడా వెళ్లగా ఇరు పార్టీల ముఖ్య నాయకులు వారించడంతో పాటు పోలీసుల ఊరడింపుతో బిఆర్ఎస్, బీజేపి కార్యకర్తలు సద్దుమనిగిన సందర్భాలెన్నో ఉన్నాయి. అయితే ఇప్పుడు నేరుగా సాధారణ ఎన్నికల్లో సమరానికి దుంకుతున్న పందెంకోళ్ల వలె మీరెంత అంటే మీరెంత అన్నట్టుగా బరిలో నిలుస్తున్నారు. ఇది వరకే ఎంపి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే రఘునందన్‌రావులు నియోజకవర్గంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్యంగా ఎమ్మెల్యే రఘునందన్‌రావు యువతకు డ్రైవింగ్ లైసెన్స్‌లు ఉచితంగా అందించే ప్రక్రియకు శ్రీకారం చుట్టడంతో రెండు మూడు రోజుల వ్యవధిలోనే ఎంపి ప్రభాకర్‌రెడ్డి సైతం డ్రైవింగ్ లైసెన్స్‌లు ఉచితంగా అందించడంతోపాటు హెల్మెట్‌లను కూడా అందిస్తామంటూ ఒక అడుగు ముందుకేసి యువతను ఆకట్టుకునే ప్రయత్నం చేశారు. కాగా ఇరు పార్టీలకు వేల సంఖ్యలో డ్రైవింగ్ లైసెన్స్‌ల కోసం నియోజకవర్గ వ్యాప్తంగా దరఖాస్తులు రాగా ఎవరికి కేటాయించిన సమయాల్లో వారు వారి వారి అభ్యర్థులకు లెర్నింగ్ లైసెన్స్‌ల జారీ ప్రక్రియను దాదాపుగా పూర్తి చేశారనే చెప్పుకోవచ్చు. అంతేకాకుండా నియోజకవర్గ వ్యాప్తంగా పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఎంపి ప్రభాకర్‌రెడ్డి స్వయంగా పాల్గొనడం, మరికొన్ని అభివృద్ధి కార్యక్రమాల్లో ఎమ్మెల్యే స్వయంగా పాల్గొనడంతో ఇద్దరు కలిసి చేపట్టిన అభివృద్ధి పనులు కొన్ని మాత్రమే అని చెప్పుకోవచ్చు. కానీ సందర్భమేదైనా ఒకరిపై ఒకరు ప్రత్యారోపణలు, దూషణలు చేసుకుంటూ మేమంటే మేము అభివృద్ధి చేశామంటూ ప్రజల్లోకి చొచ్చుకువెళ్లే ప్రయత్నం విపరీతంగానే చేశారని చెప్పుకోవచ్చు. అంతేకాకుండా వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు స్వయంగా మంత్రి హరీష్‌రావు సైతం హాజరై దుబ్బాక నియోజకవర్గ అభివృద్ధికి తాను అండగా ఉంటానని అటు కార్యకర్తలకు, ఇటు ప్రజలకు భరోసానిచ్చే ప్రయత్నం చేశారు. అయితే ఎమ్మెల్యే రఘునందన్‌రావు మాత్రం బిఆర్ఎస్ పార్టీతోపాటు మంత్రి హరీష్‌రావును పత్రికాముఖంగా ఎన్నోసార్లు ప్రశ్నిస్తూ తనదైన మార్కును చూపించే ప్రయత్నమూ చేశారు.

**వజ్రాయుధంతో సిద్ధంగా ఉన్న ఓటర్లు**

దుబ్బాక నియోజకవర్గ ఓటర్ల తీర్పు ఇతర నియోజకవర్గాల ప్రజలకు అంతుచిక్కని అంశంగా ప్రతి ఎన్నికల్లోనూ నిలుస్తుందనే చెప్పుకోవచ్చు. ఎందుకంటే దుబ్బాక నియోజకవర్గ ప్రజలు ఏ వ్యక్తికీ వరుసగా రెండుసార్లకంటే అధికంగా గెలిపించి అధికారాన్ని ఇచ్చిన దాఖలాలు చాలా తక్కువనే చెప్పుకోవచ్చు. ప్రతి ఎన్నికకు దుబ్బాక నియోజకవర్గ ఓటరు నాడి ఏవిధంగా ఉంటుందనే విషయంపై ఎన్నో పార్టీలు, ఎన్నో కంపెనీలు వివిధ సర్వేలు చేసినప్పటికీ అక్కడక్కడా ఒకటి రెండు కంపెనీలు చేసిన సర్వేలు మాత్రమే ఓటరు నాడిని గెలిపించిన పార్టీకి చేరువగా తీసుకువస్తాయి తప్పితే అది కూడా ఖచ్చితమైన ఫలితాన్ని ఇవ్వలేవు. రాష్ట్ర వ్యాప్తంగా రాజకీయంగా తలపండిన ఎంతో మంది రాజకీయ విశ్లేషకులు ఏయే ప్రాంతాల్లో ఏ పార్టీ గెలుస్తుందనే అంశంపై ఊహించి చెప్పగలరేమో కానీ దుబ్బాక ఓటరు నాడి మాత్రం రాజకీయ విశ్లేషలకులకు సైతం ఎప్పటికీ ఊహకందని అంశమే. ఎన్నికల ఫలితాల్లో చివరి రౌండ్ వరకు ఏ పార్టీకి అధికారం కట్టబెడుతారో కూడా ఊహించలేము. మరి ఈసారి ఓటరునాడి ఏవిధంగా ఉంటుందో తెలియాలంటే ముందుగా కాంగ్రెస్ పార్టీ తమ అభ్యర్థిని ప్రకటిస్తే ముచ్చటగా మూడు పార్టీలు ప్రచారం సాగిస్తే ఎవరిని గెలిపించాలో దుబ్బాక ఓటరు తమ చేతిలో ఉన్న వజ్రాయుధంతో అచ్చుగుద్ది అధికారం అప్పజెప్పే వరకు వేచి చూడాల్సిందే.

---

## బిఆర్ఎస్ శ్రేణుల సంబరాలు



సదాశివపేట, అక్టోబర్ 16, మనం న్యూస్: సంగారెడ్డి బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ అభ్యర్థిగా చింతా ప్రభాకర్‌కు ముఖ్యమంత్రి కేసీఆర్ బి ఫామ్ అందజేసిన సందర్భంగా సదాశివపేట పట్టణంలో బిఆర్ఎస్ శ్రేణులు టపాసులు పేలుస్తూ స్వీట్లు పంచుతూ సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంగారెడ్డి నియోజకవర్గంలో ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ప్రజా సంక్షేమం కోసం పాటుపడుతున్న వ్యక్తి చింతా ప్రభాకర్‌కు బిఆర్ఎస్ బి ఫామ్ అందించడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షులు చీల మల్లన్న, మున్సిపల్ వైస్ ఛైర్మన్ చింతా గోపాల్, మున్సిపల్ కౌన్సిలర్లు విద్యాసాగర్‌రెడ్డి, చౌదరి ప్రకాష్, గుండు రవి, ఆకుల శివ, పిల్లోడి విశ్వనాథం, నాసిర్, పట్టణ ప్రధాన కార్యదర్శి పిల్లిగుండ్ల వీరేశం, పట్టణ యువత అధ్యక్షులు బిట్ల ప్రేమ్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.

# మా పార్టీ బిఆర్ఎస్... మా లీడర్ హరీష్



చిన్నకోడూరు, అక్టోబర్ 16, మనం న్యూస్ః మా పార్టీ బిఆర్ఎస్, మా లీడర్ హరీష్‌రావు అని చిన్నకోడూరు రెడ్డి సంఘ సభ్యులు అన్నారు. రాబోయే ఎన్నికలలో గంపగుత్తగా రెడ్డి సంఘ సభ్యుల ఓట్లన్నీ బిఆర్ఎస్ అభ్యర్థి హరీష్‌రావుకే వేస్తామని ఏకగ్రీవ తీర్మాణం చేశారు. తీర్మాన పత్రాన్ని సిద్దిపేట క్యాంప్ ఆఫీస్‌లో మంత్రి హరీష్‌రావుకు అందజేశారు. ఈ సందర్భంగా రెడ్డి జనసేవ సంఘ సభ్యులు మాట్లాడుతూ అభివృద్ధి చేసే నాయకుడి వెంటే మేముంటామని, వచ్చే అసెంబ్లీ ఎన్నికలలో లక్ష 50 వేల మెజార్టీ ఓట్లలో తాము కూడా భాగస్వాములవుతామన్నారు. ఈ సందర్భంగా మంత్రి హరీష్‌రావు మాట్లాడుతూ రైతుల కోసం పాటుపడే నాయకుడు సీఎం కేసీఆర్ అని, రైతుబంధు ప్రతి సంవత్సరం పెంచుతూ మొత్తంగా రూ. 16 వేలకు రైతుబంధు సహాయాన్ని అందిస్తామన్నారు. అగ్రవర్ణ పేద పిల్లల కోసం గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం మండల కేంద్రానికి చెందిన బీజేపి నాయకులు గూడ మహేందర్‌రెడ్డి, గూడ మాధవరెడ్డి, మణికాంత్‌రెడ్డిలతో సహా 50 మంది బిఆర్ఎస్ పార్టీ మేనిఫెస్టోకు ఆకర్షితులై గులాబీ కండువా కప్పుకున్నారు.

–శంకరాయకుంటలో... మండల పరిధి ఓబులాపూర్ మధిర గ్రామం శంకరాయకుంటకు చెందిన గ్రామస్తులు రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో మా ఓట్లన్నీ హరీష్‌రావుకే అంటూ ఏకగ్రీవ తీర్మానం చేసి తీర్మాన పత్రాన్ని ఎంపిపి మాణిక్యరెడ్డి, పార్టీ మండల అధ్యక్షులు కాముని శ్రీనివాస్‌లకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ఛైర్మన్ కనకరాజు, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షులు ఉమేష్‌చంద్ర, నాయకులు మల్లేశం తదితరులు ఉన్నారు.



## బ్రహ్మచారిణి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చిన అమ్మవారు



మిరుదొడ్డి, అక్టోబర్ 16, మనం న్యూస్ః అక్బర్‌పేట భూంపల్లి మండల పరిధిలోని మోతె గ్రామంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి సన్నిధిలో శ్రీ దేవి శరన్నవ రాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని అమ్మవారు బ్రహ్మచారిణి అవతారంతో సోమవారం రెండవ రోజు భక్తులకు దర్శనమిచ్చింది. ఈ సందర్భంగా సర్పంచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ వెంకటేశ్వర స్వామి సన్నిధిలో గల శ్రీ సరస్వతి మాత దుర్గాభవాని మా తగా పూజలందుకోవడం జరుగుతుందన్నారు. బాస ర సరస్వతి వలె మోతె గ్రామంలో అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. కావున భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి ఉదయం, సాయంకాలం వేళలో జరిగే పూజా కార్యక్రమాల్లో



పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కాగలరన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు నర్సింహారెడ్డి, బాల్‌రెడ్డి, మోతె గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## పాత వాగ్ధానాలు మరిచి మళ్లీ కొత్త వాగ్ధానాలా...



చిన్నకోడూరు, అక్టోబర్ 16, మనం న్యూస్ః గత ఎన్నికల్లో ఇచ్చిన వాగ్ధానాలను మరిచి రాబోయే ఎన్నికలకు కొత్త వాగ్ధానాలను ప్రకటించడం హాస్యాస్పదమని రెడ్డి జాగృతి యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు యాల్ల లింగారెడ్డి అన్నారు. రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని ఐదేళ్లు గడిచినా బిఆర్ఎస్ ఆ మాటను నిలబెట్టుకోలేకపోయిందని విమర్శించారు. ఉపాధ్యాయ అర్హతల పరీక్షలో ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు జనరల్ కేటగిరీతో సమానంగా మార్కులను కేటాయించడంతో వేలాది మంది నష్టపోయారన్నారు. పోలీస్ నియామక పరీక్షల్లో కూడా ప్రిలిమ్స్‌లో అర్హత మార్కులు తగ్గించకపోవడంతో చాలా మంది యువత మెయిన్స్ పరీక్షలు రాయలేకపోయారన్నారు. మేనిఫెస్టోలో అగ్రవర్ణాలకు సంబంధించి కార్పొరేషన్ అంశం లేకపోవడం శోచనీయమన్నారు. వివిధ పార్టీలలో ఉన్న ఎంపిలు , ఎమ్మెల్యేలు ఇతరత్రా లీడర్లు రెడ్డి కార్పొరేషన్‌పై మాట్లాడకపోవడం సిగ్గుచేటన్నారు.



## విద్యార్థులు క్రీడల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరచాలి

### జోనల్ మీట్-9లో జిల్లా అడిషనల్ కలెక్టర్ గరిమా అగ్రవాల్

మిరుదొడ్డి, అక్టోబర్ 16, మనం న్యూస్ః విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణించాలని జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్ అన్నారు. సోమవారం జోనల్‌మీట్ 9లో భాగంగా మిరుదొడ్డి మండల పరిధిలోని అల్వాల సాంఘిక గురుకుల పాఠశాలలో నిర్వహించిన ముగింపు సమావేశానికి ఆమె హాజరయ్యారు.ఈ సందర్భంగా హాజరైన 1020 మంది విద్యార్థుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన జట్లకు బహుమతులను అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థి దశ నుండే విద్యార్థులు క్రమశిక్షణ అలవర్చుకోవాలన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల సంయుక్త కార్యదర్శి అనంత లక్ష్మి, ఆర్‌సిఓ నిర్మల, ఆయా పాఠశాలల ప్రిన్సిపల్‌లు ధన లక్ష్మి, సుజాత, వేదాంతచారి, కల్పన, లక్ష్మాంజలి, ప్రియ దర్శిని, ఉషా కిరణ్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.



## పోలింగ్‌బూత్‌లను పరిశీలించిన జిల్లా అదనపు కలెక్టర్




మిరుదొడ్డి, అక్టోబర్ 16, మనం న్యూస్ః నవంబర్ 30న జరిగే శాసన సభ ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్ అన్నారు. సోమవారం మిరుదొడ్డి మండలంలోని పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓటు నేది వజ్రాయుధంలాంటిదని, కావున ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రతి ఒక్కరు సహకరించాలన్నారు. ఆమె వెంట ఎంపిడిఓ రాజిరెడ్డి, ఎంఆర్ఓ గోవర్ధన్, పంచాయతీ కార్యదర్శి ఫయీమ్‌తోపాటు తదితరులు ఉన్నారు.

## బిఆర్ఎస్‌లో కరువైన సముచిత స్థానం

### ఎమ్మెల్యే సమక్షంలో బీజేపిలో చేరిన శేరి బిక్షపతి



మిరుదొడ్డి, అక్టోబర్ 16, మనం న్యూస్ః అక్బర్‌పేట భూంపల్లి మండల పరిధిలోని రుద్రారం గ్రామానికి చెందిన బిఆర్ఎస్ సీనియర్ నాయకులు శేరి బిక్షపతి తమ పార్టీలో తనకు సముచిత స్థానం కల్పించడం లేదంటూ దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు సమక్షంలో సోమవారం రోజున బీజేపి పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుబ్బాక నియోజకవర్గం అభివృద్ధి ఎమ్మెల్యే రఘునందన్‌రావుతోనే సాధ్యమవుతుందనే ఉద్దేశంతో తాను బీజేపిలో చేరడం జరుగుతుందన్నారు. జరగబోయే ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో ఎమ్మెల్యే రఘునందన్‌రావును గెలిపించుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపి జిల్లా నాయకులు మల్లన్నగారి బిక్షపతి, రుద్రారం గ్రామ బీజేపి నాయకులు తదితరులు ఉన్నారు.

## రైతులను మోసం చేసిన బిఆర్ఎస్



చిన్నకోడూరు, అక్టోబర్ 16, మనం న్యూస్ః దేశానికి బువ్వ పెట్టే రైతులను బిఆర్ఎస్ పార్టీ మోసం చేసిందని బీజేవైయం మండల నాయకులు ఏనుగుల సాయికిరణ్ విమర్శించారు. రైతులందరికీ రుణ మాఫీ చేస్తామని నమ్మించి రైతుల ఉసురు పోసుకుందన్నారు. పూర్తి స్థాయిలో రుణమాఫీ కాకపోవడంతో అన్నదాతలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకోలేని బిఆర్ఎస్ నాయకులు ఓట్లు ఎలా అడుగుతారని, గ్రామాలలో తిరిగి ఓట్లు అడిగే నైతిక హక్కు గులాబీ పార్టీ నాయకులకు లేదన్నారు. రాష్ట్రంలో ఉద్యోగాలు లేక నిరుద్యోగులు ఇబ్బందులు పడుతున్నారని, నోటిఫికేషన్‌ల పేరుతో కాలయాపన చేసి నిరుద్యోగులను సైతం రాష్ట్ర ప్రభుత్వం మోసం చేసిందన్నారు. నోటిఫికేషన్‌లు తప్ప ఉద్యోగాలు ఇచ్చిన దాఖలాలు ఎక్కడా లేవని, రాబోయే ఎన్నికల్లో రైతులు, నిరుద్యోగులు, మహిళలు యావత్ ప్రజానీకం బిఆర్ఎస్ పార్టీకి బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో అనిల్, నాగరాజు తదితరులు ఉన్నారు.

# బిఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం

**-బిఆర్ఎస్ మేనిఫెస్టోతో ప్రతిపక్షాలకు గుబులు**

**-ఎంపి, దుబ్బాక బిఆర్ఎస్ అభ్యర్థి ప్రభాకర్‌రెడ్డి**

**-ప్రభాకర్‌రెడ్డిని లక్ష పై చిలుకు మెజార్టీతో గెలిపించుకుంటాం**

**-బిఆర్ఎస్‌లో చేరిన కేఆర్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు**

**కోమటిరెడ్డి రజనీకాంత్‌రెడ్డి**

దుబ్బాక టౌన్, అక్టోబర్ 16, మనం న్యూస్ః తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు వెళ్లాలంటే సీఎం కేసీఆర్ సారథ్యంలోని బిఆర్ఎస్ పార్టీతోనే సాధ్యమని ఎంపి, దుబ్బాక నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం రోజున కేఆర్ఆర్ ఫౌండేషన్ ఛైర్మన్ కోమటిరెడ్డి రజనీకాంత్‌రెడ్డి కొత్త ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో సుమారు 500 మందితో కలిసి బిఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా రజనీకాంత్‌రెడ్డికి, పార్టీలో చేరిన వారికి కండువా కప్పి ఎంపి సాదరంగా బిఆర్ఎస్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా దుబ్బాక పట్టణంలోని కేఆర్ఆర్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అబద్ధపు హామీలతో గత ఉప ఎన్నికల్లో రఘునందన్‌రావు ఎమ్మెల్యేగా గెలిచాడని, గెలిచిన మూడేళ్లలో దుబ్బాక అభివృద్ధికి చేసిందేమీ లేదన్నారు. నిరుద్యోగులకు రూ.3 వేల నిరుద్యోగ భృతి ఇస్తానని ప్రగల్బాలు పలికి ఇంత వరకు ఏ ఒక్కరిని కూడా ఆదుకోలేదన్నారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా సీఎం కేసీఆర్ బిఆర్ఎస్ పార్టీ మేనిఫెస్టోను పెట్టారని, బిఆర్ఎస్ పార్టీ గెలిచిన ఐదేండ్లలోనే వృద్ధులకు, మహిళలకు



రెండువేలున్న పింఛన్‌ను రూ.5 వేలకు పెంచడం గొప్ప శుభపరిణామమన్నారు. రైతన్నల సంక్షేమం కోసం నిరంతరం బిఆర్ఎస్ పార్టీ కృషి చేస్తుందని, గతంలో ఎకరాకు రూ. 10 వేలు ఇచ్చిన పంట పెట్టుబడి సాయం రూ.12 వేలు ఇస్తుందన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు గ్యాస్ నేడు గుదిబండగా మారిందని, కేంద్ర ప్రభుత్వం రూ.1200లకు సిలిండర్ అందిస్తే రాష్ట్రం రూ. 400లకే అందించేలా బిఆర్ఎస్ మేనిఫెస్టోను రూపొందించారన్నారు. రాష్ట్రంలో ఎక్కడా కూడా బీజేపి పార్టీ లేదన్నారు. ఎన్నికల ముదు దొంగ హామీలిస్తూ ప్రజల్లో ప్రతిపక్ష పార్టీలు తిరుగుతున్నాయని, వారి మాటలు నమ్మి మోసపోవద్దన్నారు. రానున్న ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి బిఆర్ఎస్ పార్టీ గెలుపుకు కృషి చేయాలన్నారు. కోమటిరెడ్డి రజనీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ



తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి చెందిందంటే అది సీఎం కేసీఆర్‌తోనేనని, కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బిఆర్ఎస్ పార్టీలో ఎంపి ప్రభాకర్‌రెడ్డి సమక్షంలో చేరడం జరిగిందన్నారు. బీజేపి పార్టీ తరుపున గెలిచిన ఎమ్మెల్యే దుబ్బాక అభివృద్ధికి చేసిందేమీ లేదని, మరోసారి నమ్మి మోసపోవద్దన్నారు. దుబ్బాక అభివృద్ధి జరగాలంటే అది బిఆర్ఎస్ పార్టీతోనే సాధ్యమని, దుబ్బాక బిఆర్ఎస్ అభ్యర్థిగా బరిలో ఉన్న కొత్త ప్రభాకర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కోమటిరెడ్డి వెంకటనర్సింహారెడ్డి, మనోహర్‌రావు, సోలిపేట సతీష్‌రెడ్డి, జెడ్పిటిసి కడతల రవిందర్‌రెడ్డి, నాయకులు రొట్టె రాజమౌళి, కొత్త కిషన్‌రెడ్డి, గన్నె భూంరెడ్డి, పల్లె వంశీకృష్ణ, ఆయా గ్రామాల ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, బిఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సామాన్యులపై వరాల జల్లులు

**బిఆర్ఎస్ మండల అధ్యక్షులు పనుగట్ల శ్రీనివాస్ గౌడ్**



జగదేవ్‌పూర్, అక్టోబర్ 16, మనం న్యూస్ః వచ్చే ఎన్నికల దృష్ట్యా బిఆర్ఎస్ మేనిఫెస్టో ద్వారా సామాన్యులపై వరాల జల్లులు కురిపించిన వ్యక్తి సీఎం కేసీఆర్ అని మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు పనుగట్ల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన మేనిఫెస్టో పట్ల సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ రైతుబంధు పథకం కింద అందించే ప్రయోజనాన్ని రూ.16 వేలకు పెంచుతామని హామీ ఇచ్చారని, దీని ద్వారా అన్నదాతలకు ఊరట కలుగుతుందన్నారు. మార్చి తర్వాత రూ. 12 వేలు క్రమంగా పెరుగుతూ ఐదవ సంవత్సరం నిండే నాటికి రూ.16 వేలు అందిస్తామని, గ్యాస్ సిలిండర్ వినియోగదారులకు కేవలం రూ.400లకే సిలిండర్ అందిస్తామని ప్రకటించడం హర్షనీయమన్నారు. బిఆర్ఎస్ మేనిఫెస్టో ద్వారా సామాన్య ప్రజానీకానికి వరాల జల్లు కురిసిందన్నారు.



## గజ్వేల్‌లో గెలిచేది బీజేపి పార్టీయే

**కలిసికట్టుగా ఉంటే బీజేపిదే విజయం**

**కర్ణాటక బీజేపి మాజీ ఎమ్మెల్యే రాజ్‌కుమార్ పాటిల్**

గజ్వేల్, అక్టోబర్ 16, మనం న్యూస్ః ఇంతకాలం కేసీఆర్ పాలనలో అస్తవ్యస్థంగా ఉన్న గజ్వేల్ నియోజకవర్గాన్ని ఒక గాడిలో పెట్టేందుకు ఈసారి ఎన్నికల్లో బీజేపి గెలవడం తథ్యమని, ఇందుకు ఒక ఉత్తమ నాయకుడు రాబోతున్నాడని కర్ణాటక బీజేపి మాజీ ఎమ్మెల్యే రాజ్‌కుమార్ పాటిల్, బీజేపి రాష్ట్ర నాయకులు రాంచంద్రరావు అన్నారు. గజ్వేల్ పట్టణంలో సోమవారం నిర్వహించిన నియోజకవర్గ కార్యకర్తల విస్తృత సమావేశంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో బీజేపి గజ్వేల్‌లోనే కాదు తెలంగాణరాష్ట్రంలో అధికారంలోకి రాబోతుందన్నారు. గజ్వేల్‌లో బీజేపి గెలుపు కోసం ప్రతి కార్యకర్రత సైనికునిలా కృషి చేయాలని, ప్రతి కార్యకర్త ఒక నాయకుడే అన్నారు. మండల అధ్యక్షులు బూత్ కమిటీలను ఏర్పాటు చేసి గ్రామాల్లోకి బీజేపి ప్రభుత్వం అందిస్తున్న పథకాలను గడపగడపకు వివరించాలన్నారు. మనమంతా కలిసికట్టుగా ఐక్యంగా కష్టపడితే ఈసారి విజయం బీజేపిదే అన్నారు. ఈ కార్యక్రమంలో మేనిఫెస్టో సభ్యులు కప్పర ప్రసాద్‌రావు, నాయకుడు నందన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు

**రెండవ రోజు గాయత్రి అలంకారంలో భక్తులకు దర్శనం**



మిరుదొడ్డి, అక్టోబర్ 16, మనం న్యూస్ః అక్బర్‌పేట భూంపల్లి మండల పరిధిలోని వీరారెడ్డిపల్లి గ్రామంలో నూతనంగా కచేరి వద్ద నెలకొల్పిన శ్రీ దుర్గామాత నవరాత్రి ఉత్సవాల్లో రెండవ రోజు అమ్మవారు శ్రీ గాయత్రి మాత అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మనోహర్‌శర్మ ఆధ్వర్యంలో వేద బ్రాహ్మణోత్తములచే నిత్యం 9 గంటలకు పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గ్రామస్తులంతా ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో ఉండాలని, నేడు అమ్మవారి వద్ద 8 గంటలకు కుంకుమార్చన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. కావున భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

## మృతుల కుటుంబాలకు తూముకుంట నర్సారెడ్డి పరామర్శ



జగదేవ్‌పూర్, అక్టోబర్ 16, మనం న్యూస్ః తీగుల్ గ్రామంలో బతుకమ్మ పండుగ సందర్భంగా పటేల్ చెరువు వద్ద పనులు చేయడానికి వెళ్లి చెరువులో ప్రమాదవశాత్తు మునిగి మృతి చెందిన తీగుల్ పారిశుద్ధ్య కార్మికులు గిరిపల్లి భారతి, కర్రెమొల్ల బాబు, ఎల్లం యాదమ్మల కుటుంబాలను ఆదివారం కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూముకుంట నర్సారెడ్డి వారి కుటుంబాలను పరామర్శించి వేరువేరుగా రూ 10 వేలు, అదేవిధంగా 50 కిలోల చొప్పున బియ్యం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధిత కుటుంబాలకు పార్టీ పరంగా జిల్లా కలెక్టర్ ద్వారా అన్ని విధాల సహాయ సహకారాలు అందేలా మాట్లాడుతామన్నారు. వారి వెంట పిఏసిఎస్ మాజీ ఛైర్మన్ నరేందర్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు రవిందర్‌రెడ్డి పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ హ్యాట్రిక్ విజయం సాధించడం ఖాయం

**ఎమ్మెల్సీ వంటేరు యాదవరెడ్డి**

గజ్వేల్, అక్టోబర్ 16, మనం న్యూస్ః ఎన్నికల వేళ ప్రలోభాలకు గురి చేయడం గత పార్టీల చరిత్ర అని, ప్రజా అవసరాలను గ్రహించిన వ్యక్తి కేసీఆర్ అని, ప్రజలు బిఆర్ఎస్ పార్టీపై నమ్మకంతో ఈసారి బిఆర్ఎస్ పార్టీకి హ్యాట్రిక్ విజయం అందించనున్నారని ఎమ్మెల్సీ వంటేరు యాదవరెడ్డి అన్నారు. సోమవారం గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రూ.200 పెన్షన్ కూడా కాంగ్రెస్ పార్టీ నాడు సకాలంలో అందించలేదని, ప్రభుత్వ ఉద్యోగులకు వేతనాలు ఆలస్యంగా ఇచ్చినా ప్రజా సంక్షేమ పథకాలను అమలుపరచడంలో బిఆర్ఎస్ వెనుకడుగు వేయలేదన్నారు. అన్ని రంగాల్లో తెలంగాణను ముందుకు తీసుకువెళ్లిన నాయకుడు సీఎం కేసీఆర్ అని నియోజకవర్గంలోని ప్రతి కార్యకర్త ఒక సైనికుడిలా కేసీఆర్ గెలుపు కోసం పని చేయాలన్నారు. ఈసారి కేసీఆర్‌కు లక్ష మెజార్టీయే లక్ష్యంగా కృషి చేయాలన్నారు. అభివృద్ధిలో సిద్దిపేటతో పోటీలాగే మెజార్టీలో కూడా అదే పోటీ



ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి ఛైర్మన్ శ్రీనివాస్, జెడ్పిటిసి పంగ మల్లేశం, బిర్ఎస్ మండల అధ్యక్షులు మధు, నాచారం ఆలయ మాజీ ఛైర్మన్ యాదగిరి, మున్సిపల్ వైస్ ఛైర్మన్ జకీయొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# పదేండ్లలో పూర్తి చేయనోడు... ఆరు నెలల్లో పూర్తి చేస్తాడట

**పదేండ్లలో పూర్తి చేయనోడు...ఆరు నెలల్లో పూర్తి చేస్తాడట**

**- కేసీఆర్ ప్రసంగంలో పస లేదు**

**- ఎమ్మెల్యేగా సతీశ్‌కుమార్ అన్‌ఫిట్**

**- అమలు కానీ హామీలు కేసీఆర్‌వి**

**- గత పాలకులను విమర్శించే హక్కు మీకు లేదు**

**- కరీంనగర్ మాజీ పార్లమెంట్ సభ్యుడు పొన్నం ప్రభాకర్ గౌడ్**

హుస్నాబాద్,అక్టోబర్ 16,(మనం న్యూస్): గత పదేండ్లలో గౌరవెల్లి ప్రాజెక్టును పూర్తి చేయనోడు...మళ్లీ అధికారంలోకి వస్తే ఆరు నెలల్లో గౌరవెల్లి ప్రాజెక్టును పూర్తి చేసే బాధ్యత నాదే అని కేసీఆర్ అంటుంటే వైఫల్యం చెందామని ఒప్పుకున్నట్టే కదా అని కరీంనగర్ మాజీ పార్లమెంట్ సభ్యుడు పొన్నం ప్రభాకర్ గౌడ్ అన్నారు. హుస్నాబాద్ పట్టణ కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్ గౌడ్ మాట్లాడుతూ హుస్నాబాద్ నియోజకవర్గానికి సంబంధించిన ఏలాంటి వరాలను సీఎం కేసీఆర్‌ను ఎమ్మెల్యే అడగకుండా ఉత్సవ విగ్రహంలా నిలుచున్నాడని ఆయన ఆగ్రహం వ్యక్తం చేసారు. హుస్నాబాద్ ఎమ్మెల్యేగా సతీశ్‌కుమార్ అన్‌ఫిట్ అన్నారు. ప్రజా ఆశీర్వాద సభ అట్టర్ ఫ్లాప్ అయ్యిందని దీనిని ప్రజా తిరస్కరణ సభ అని పిలిస్తే బాగుంటుందన్నారు. మీరేదో చేస్తారని రెండు సార్లు హుస్నాబాద్ ప్రజలు మిమ్మల్ని ఎమ్మెల్యేగా గెలిపిస్తే ఈ ప్రజల ఆకాంక్షల గురించి ఎందుకు నోరు తెరవలేదన్నారు. ఓట్లేసిన వారి డిమాండ్లను అడిగే దమ్ములేని మీకు మళ్ళీ ఎమ్మెల్యే పదవి అవసరమా మీరే చెప్పాలన్నారు. మీ ఇంటికే సీఎం కేసీఆర్ వచ్చిన హుస్నాబాద్ నియోజకవర్గంలో అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉందన్నారు. హుస్నాబాద్‌లోని సభలో ముఖ్యమంత్రి ప్రసంగంలో ఎలాంటి పస లేదన్నారు. ఎల్కతుర్తిలో బస్టాండ్‌ను నిర్మిస్తానని కేసీఆర్ ప్రకటించడం సిగ్గుచేటన్నారు. ఎమ్మెల్యే స్థాయిలో జరగాల్సిన పనులు కూడా ముఖ్యమంత్రి ప్రకటించడం విడ్డూరంగా ఉందన్నారు. హుస్నాబాద్ ప్రాంతానికి సంబంధించి గుండెకాయ అయినటువంటి గౌరవెల్లికి సంబంధించి గౌరవెల్లి పూర్తి చేసే బాధ్యత నాది అంటున్నడు. 2014 లో కుర్చీ వేసుకుని కడతా అన్న మీరే పది సంవత్సరాల తర్వాత కూడా గౌరవెల్లి పూర్తి చేసే బాధ్యత నాది అంటే ఈ ప్రాంత ప్రజలు మీకు ఏమి జవాబు చెప్పాలన్నారు. ఎల్లమ్మ చెరువును పెద్ద టూరిజం ప్రాజెక్టుగా చేసే అవకాశమున్న చేయకపోవడం దురదృష్టకరమన్నారు. సిద్దిపేటలోని కోమటి చెరువు పెద్దగా మార్చుకోగలిగినపుడు కనీసం దానిని నకలు కొట్టిన ఎల్లమ్మ చెరువు టూరిజం ప్రాజెక్టుగా మారేదన్నారు. బడుగు, బలహీన వర్గాలకు సంబంధించి స్ఫూర్తి ప్రధాత ఈ ప్రాంతంలో సర్దార్ సర్వాయి పాపన్నకు సంబంధించిన కోటలు ఉన్నాయని ఆయన తెలిపారు. రాష్ట్రంలో ఉన్న ప్రతి తెలంగాణ బిడ్డను ఆ ప్రాంతాన్ని పర్యటించే విధంగా టూరిజం ప్రాంతంగా తీర్చిదిద్దాల్సింది అది చేయలేదన్నారు. శనిగరం ప్రాజెక్టుకు సంబంధించి కాలువల గురించి సీఎం మాట్లాడుతుంటే నవ్వు వస్తోందన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో అన్యాయం జరిగిందనే తెలంగాణ కోసం పోరాటం చేసాం కదా అన్నారు. తెలంగాణ వచ్చాక కూడా గత పాలకుల పై విమర్శలు చేస్తున్నారంటే అది మీ అసమర్ధతనే అన్నారు. కొత్తకొండ వీరభద్రుడి స్వామి ఎంతో అభివృద్ధి చెందాల్సి ఉండేదన్నారు. హుస్నాబాద్ ఎల్లమ్మ తల్లి, పొట్లపల్లి శ్రీస్వయాంభూ రాజేశ్వరస్వామి, సింగరాయ జాతరను ఎంతో పెద్దగా జరగాల్సి ఉండేది కానీ వీటికి ప్రాధాన్యత ఇవ్వకుండా అభివృద్ధి చేయడంలో పూర్తిగా విఫలమయ్యారని ఆయన మండిపడ్డారు. రాష్ట్ర స్థాయిలో తీన్‌పత్తి ఆడిన విధంగా ఎక్కి దో...దోకి తీన్...తీన్ కి చార్ అన్న విధంగా కాంగ్రెస్ పథకాలను కాపీ కొట్టడం తప్ప బీఆర్‌ఎస్ మేనిఫెస్టో ఏమి లేదన్నారు. మా గ్యారంటీలకు



బ్రాండ్ అంబాసిడర్‌గా హరీశ్, కేటీఆర్‌లు అయ్యారని ఆయన విమర్శించారు. నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఎందుకు ఇవ్వలేదో సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేసారు. కాంగ్రెస్ పార్టీ చెప్పింది గ్యారంటీల రూపంలో గ్యారంటీ కార్డును ఇంటి ఇంటికి అందజేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. గాలి మాటల కేసీఆర్ పొద్దటికో ఓ మాట మాపటికో ఓ మాట మాట్లాడే బీఆర్‌ఎస్ అమలు కానీ హామీలు ఇస్తూ ప్రజలను మోసం చేసేందుకు ప్రయత్నం చేస్తుందన్నారు. కాంగ్రెస్ హామీలను ఆదరించి ప్రజలందరూ కాంగ్రెస్‌కు ఓటేసి గెలిపించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో పిసిసి సభ్యులు కేడం లింగమూర్తి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చిత్తారి పద్మ, కౌన్సిలర్ భూక్య సరోజన, మహిళా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బోనగిరి రజిత, హుస్నాబాద్ మండల అధ్యక్షుడు బంక చందు, నాయకులు ఎం.డీ.హసన్, వెన్న రాజు, ఆయా మండలాల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులున్నారు.

## బాలత్రిపుర సుందరిగా దర్శనమిచ్చిన అమ్మవారు



కొండపాక, అక్టోబర్ 16, మనం న్యూస్: కొండపాక మండలం మర్పడగ గ్రామంలోని శ్రీ విజయ దుర్గా సమేత సంతాన మల్లికార్జున స్వామి క్షేత్రంలో శరన్నవ రాత్రి ఉత్సవాలలో రెండవ రోజైన సోమవారం విజయదుర్గా మాత బాలత్రిపుర సుందరిగా భక్తులను అనుగ్రహించింది. గురు మదనానంద సరస్వతి పీఠాధి పతులు మాధవానంద సరస్వతి స్వామి క్షేత్రాన్ని సందర్శించి విజయదుర్గా మాతకు సంతాన మల్లికారుజ్న స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదపండితుల పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఉదయం 6 గంటలకు విజయదుర్గా మాతకు విశేష పంచామృత ఫలరస అభిషేకం నిర్వహించి పట్టువస్త్రాలతో అలంకరించారు. అనంతరం చతుష్టష్టి ఉపచారపూజ నిర్వహించి నవావరణ హవనం చేసి అన్నప్రసాద వితరణ చేశారు.

## ఇందూర్ కళాశాలలో ప్లేస్‌మెంట్ డ్రైవ్ ఎంపికైన ఏడుగురు విద్యార్థులు




సిద్దిపేట రూరల్, అక్టోబర్ 16, మనం న్యూస్: సిద్దిపేట ఇందూర్ ఇంజనీరింగ్ కళాశాలలో సిఎస్ఎస్ ఇండియా సెంటర్ ప్రై. లి. వారి ఆధ్వర్యంలో సోమవారం ఆన్ క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించినట్లు ప్రిన్సిపల్ డా. వి.పి. రాజు తెలిపారు. ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో భాగంగా 94 మంది బిటెక్ విద్యార్థులు పాల్గొన్నారన్నారు. కంపెనీ వారు నిర్వహించిన మూడు విభాగాల్లో అర్హత సాధించి ఏడుగురు విద్యార్థులు ఎంపికైనట్లు తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులకు సంవత్సరానికి నాలుగు నుండి ఐదు లక్షల వరకు జీతం వచ్చే అవకాశం ఉందన్నారు. భవిష్యత్తులో కళాశాలలో వివిధ కంపెనీల ద్వారా క్యాంపస్ ప్లేస్‌మెంట్ నిర్వహించడం జరుగుతుందని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో హెచ్ ఆర్ మేనేజర్ యశ్వంత్, ప్లేస్మెంట్ ఆఫీసర్ ప్రవీణ గోపికృష్ణ, పిఆర్ఓ రఘు పాల్గొన్నారు.

## బంగారు తెలంగాణ కాదు...తాగుబోతుల తెలంగాణ

**➲ పాత మెనిఫెస్టోలో ఇంటికో ఉద్యోగం ఇవ్వలే**

**➲ కేసీఆర్ వాయిస్ సల్లబడ్డది**

**➲ కేంద్ర నిధులతోనే జాతీయ రహదారి**

**➲ ప్రజల జీవితాలను అంగట్లో పెడుతున్న బీఆర్ఎస్**

**➲ ఏ టీమ్, బీ టీమ్‌లుగా కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు**

**➲ బీజేపీ నాయకురాలు కర్ణకంటి మంజులారెడ్డి**



హుస్నాబాద్, అక్టోబర్ 16, (మనం న్యూస్): బంగారు తెలంగాణ కాదు.. తాగుబోతుల తెలంగాణగా రాష్ట్రాన్ని కేసీఆర్ సర్కార్ మార్చారని బీజేపీ నాయకురాలు కర్ణకంటి మంజులారెడ్డి విమర్శించారు. పట్టణ కేంద్రంలోని ఆమె కార్యాలయంలో సోమవారం బీజేపీ నాయకులతో కలిసి ఆమె మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంజులారెడ్డి మీడియాతో మాట్లాడుతూ గత ఎన్నికల్లో ప్రకటించిన మెనిఫెస్టోలో ఇంటికో ఉద్యోగం రాలేదని, నిరుద్యోగ భృతి ఇవ్వలేదని ఆమె మండిపడ్డారు. ప్రస్తుతం ప్రకటించిన మెనిఫెస్టోలో అంగన్‌వాడీలు, ఆశా కార్యకర్తలకు ఆశ లేదన్నారు. ఏటీమ్‌గా కాంగ్రెస్, బీ టీమ్‌గా బీఆర్ఎస్‌లు పని చేస్తున్నాయని ఆమె ఆరోపించారు. ప్రజల జీవితాలను బీఆర్ఎస్ అంగట్లో పెట్టి అమ్ముతున్నారంటూ ఆమె ధ్వజమెత్తారు. కేసీఆర్ వాయిస్ సల్లబడ్డదని, పైసలిచ్చి జనం తెచ్చుకొని ఆశీర్వాద సభను నిర్వహించుకున్నారని ఆమె ఆరోపించారు. గ్యాస్ సిలిండర్ ధరను కేంద్ర ప్రభుత్వం పెంచిందంటూ ధర్నాలు, అందోళనలు చేసిన బీఆర్ఎస్ రూ.400 లకే సిలిండర్‌ను ఎలా అందిస్తుందంటూ ఆమె ప్రశ్నించారు. కేంద్ర నిధులతోనే ఎల్కతుర్తి-రామాయంపేట జాతీయ రహదారి అవుతుందని స్పష్టం చేసారు. ఇన్ని లక్షల రోడ్లు వేసినం అని చెబుతున్న ఎమ్మెల్యే నిధులు కేంద్రానివో, రాష్ట్రానివో కూడా తెలుసుకోనే పరిస్థితిలో లేడన్నారు. సిద్దిపేట టూ హైదరాబాద్‌కు రైలును కేటాయించిన ఘనత మోడీదే అన్నారు. పేద ప్రజల కోసం నెలకు రూ.320 తో నెల రోజుల పాటు రైలులో ప్రయాణించే వెసులుబాటును కూడా బీజేపీ కల్పించిందన్నారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్ బిల్లును అమోదించిన ఘనత మోడీదే అన్నారు. మద్యం తాగి ఎందరో తల్లిదండ్రులు ప్రాణాలు కోల్పోతున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేసారు. బెల్ట్‌షాపులతో మాంగళ్యాన్ని కోల్పోతున్నారన్నారు. బీఆర్ఎస్ ప్రజలను మభ్యపెట్టి ఏమీ సాధించలేరన్నారు. ఒక్కసారి బీజేపీకి పట్టం కట్టండి బంగారు తెలంగాణ కాదు భాగ్య తెలంగాణగా మార్చుకుందమన్నారు. గల్లీ గల్లీకో బెల్ట్‌షాపుతో అపవిత్రం అయ్యిందని అధికారంలోకి వచ్చిన తర్వాత గంగ నీళ్లతో రాష్ట్రాన్ని ప్రక్షాళన చేసుకుందమన్నారు. ఈ సమావేశంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు బత్తుల శంకర్‌బాబు, కౌన్సిలర్‌లు మ్యాదరబోయిన వేణు యాదవ్, దొడ్డి శ్రీనివాస్, చిగురుమామిడి మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, అక్కనపేట మండల అధ్యక్షుడు గొల్లపల్లి వీరాచారి, నాయకులు పిల్లి నర్సయ్య, శ్రీకాంత్, ఆయా గ్రామాల బీజేపీ కార్యకర్తలు, నాయకులు, తదితరులున్నారు.

## జనగామ ప్రజా ఆశీర్వాద సభకు తరలిన నాయకులు

చేర్యాల, అక్టోబర్ 16, మనం న్యూస్: జనగామలో ప్రజా ఆశీర్వాద సభకు చేర్యాల మండలంలోని అన్ని గ్రామాల ప్రజాప్రతినిధులు, బిఆర్ఎస్ నాయకులు భారీ ఎత్తున తరలి వెళ్లారు. ఈ సందర్భంగా ఏఎంసి ఛైర్మన్ సుంకరి మల్లేశం గౌడ్, బిఆర్ఎస్‌వి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గదరాజు చందు మాట్లాడుతూ జనగామ నియోజకవర్గ బిఆర్ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి గెలుపే లక్ష్యంగా పని చేస్తామని, మూడోసారి కేసీఆర్ ముఖ్యమంత్రి కావడం ఖాయమన్నారు. వారి వెంట మున్సిపల్ ఛైర్మన్ అంకుగారి స్వరూప రాణి, శ్రీధర్‌రెడ్డి, జితేందర్‌రెడ్డి, చందు, నాయకులు పాల్గొన్నారు.



## అఖిల భారత ప్రగతిశీల విద్యార్థి సంఘం కన్వీనర్ల రాజీనామా





సిద్దిపేట అర్బన్, అక్టోబర్ 16, మనం న్యూస్ః అఖిల భారత విద్యార్థి సంఘం జిల్లా కన్వీనరు ఒగ్గ రమేష్, జోగారి రాజులు సోమవారం అఖిల భారత విద్యార్థి సంఘానికి రాజీనామా చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ విద్యారంగాన్ని విస్మరిస్తున్న ప్రభు త్వాలపై ఎన్నో పోరాటాలు చేసి విద్యార్థి సమస్యలపై నిరంతరం పోరాటాలు ఉద్యమాలు చేశామన్నారు. తమ వ్యక్తిగత పరిస్థితుల కారణంగా విద్యార్థి సంఘాన్ని వీడడం బాధాకరమన్నారు. విద్యారంగాన్ని పూర్తిగా భ్రష్టు పట్టించే విధంగా ఈ కాషాయీకరణ కార్పోరేటీకరణ వల్ల చాలా మంది విద్యార్థులు చదువుకు దూరమయ్యే పరిస్థితి ఉందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు విద్యార్థుల పట్ల రాబోయే రోజుల్లో విద్యార్థుల భవిష్యత్తుకై మంచి చేయాలని కోరుతూ పార్టీకి రాజీనామా చేస్తున్నామన్నారు.

# బిఆర్ఎస్ పాలనలో అభివృద్ధి శూన్యం

### కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలు అమలు పక్కా

### కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గ ఇంచార్జ్ శ్రీనివాస్‌రెడ్డి



దుబ్బాక టౌన్, అక్టోబర్ 16, మనం న్యూస్ః దుబ్బాక నియోజకవర్గం అభివృద్ధి చెందింది ముత్యంరెడ్డి హయాంలో తప్ప తొమ్మిదేళ్ల బిఆర్ఎస్ పాలనలో అభివృద్ధి శూన్యమని దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం రోజున దుబ్బాక పట్టణంలోని వెంకటేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహి ంచి దుబ్బాక ఆత్మగౌరవ యాత్ర 104వ రోజు దుబ్బాక పట్టణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ కాంగ్రెస్ ప్రవేశపెట్టిన మేనిఫెస్టోనే కాపీ పేస్ట్‌గా తన మేనిఫెస్టోలో ప్రకటించిందని, పేద ప్రజల సంక్షేమం కోసం బిఆర్ఎస్ పార్టీ చేసిందేమీ లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీలను ఖచ్చితంగా అమలు చేస్తుందన్నారు. దుబ్బాకలో జరగబోయే ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపి మధ్యలోనే పోరు ఉంటుందని, బిఆర్ఎస్ పార్టీ మూడవ స్థానంలో నిలుస్తుందన్నారు. గతంలో ముత్యంరెడ్డి చేసిన అభివృద్ధి తప్ప ఏ పార్టీ కూడా దుబ్బాక నియోజకవర్గానికి చేసిందేమీ లేదన్నారు. ఎంపి ప్రభాకర్‌రెడ్డి నియోజకవర్గ ప్రజలను గుర్తుపట్టడని, ఆయనకు చూసిన వ్యక్తి కూడా రోజూ కొత్తగానే కనిపిస్తాడన్నారు. బిఆర్ఎస్ , బీజేపి పార్టీలు రెండూ ఒక్కటేనని బీజేపి పార్టీ గెలుపు కోసమే బిఆర్ఎస్ అభ్యర్థిగా కొత్త ప్రభాకర్‌రెడ్డిని ఎన్నికల్లో నిలిపారన్నారు. ఉప ఎన్నికల్లో పోటీ చేసిన సోలిపేట సుజాతరెడ్డికి బిఆర్ఎస్ టికెట్ ఎందుకు కేటాయించలేదో మంత్రి హరీష్‌రావు సమాధానం చెప్పాలన్నారు. దుబ్బాక నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే అది కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని, రానున్న ఎన్నికల్లో హస్తం గుర్తుపై ఓటేసి కాంగ్రెస్ పార్టీని భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షులు అనంతుల శ్రీను, మున్సిపల్ అధ్యక్షులు నర్మెట యేసురెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు కొంగరి రవి, జనరల్ సెక్రటరీ మంద శ్రీనివాస్, నాయకులు ఆకుల భరత్, బురాని శ్రీకాంత్, మట్ట కిషన్‌రెడ్డి, బాస మధు, సత్తు శ్రీనివాస్‌రెడ్డి, ఊషయ్యగారి రాజిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## మాదిగల యుద్ధభేరి బహిరంగ సభకు హరీష్‌రావుకు ఆహ్వానం



సిద్దిపేట అర్బన్, అక్టోబర్ 16, మనం న్యూస్ః మాదిగల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మాదిగల యుద్ధభేరి బహిరంగ సభకు హరీష్‌రావుకు ఆహ్వానం పలికినట్లు ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు వంగపల్లి శ్రీనివాస్, మాదిగ జాతీయ అధ్యక్షులు మేడి పాపన్న మాదిగలు తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి హరీష్‌రావును సిద్దిపేటలోని కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలవడం జరిగిందన్నారు. రాష్ట్రంలో 60 లక్షలు పైగా ఉన్న మాదిగలకు సామాజిక, రాజకీయ ఆర్థిక రంగాలలో తీరని అన్యాయం జరిగిందని, తక్షణమే ఆ డిమాండ్‌ల పరిష్కారం దిశగా మంత్రి హరీష్‌రావును కలిసి వినతిపత్రం అందజేయడం జరిగిందన్నారు. జనాభా దామాషా ప్రకారం అన్ని రంగాల్లో మా వాటా మాకు రావాలని కోరారు. అసెంబ్లీ సీట్ల కేటాయింపుల్లో కేసీఆర్ పునరాలోచించాలన్నారు. ఎస్సీ సబ్ ప్లాన్ నిధులపై శ్వేతపత్రం విడుదల చేయాలని, ప్రతి నియోజకవర్గంలో దళిత కుటుంబానికి దళితబంవధు అమలు చేయాలని, మంత్రివర్గంలో మాదిగలకు సముచిత స్థానం కల్పించాలన్నారు. దీంతో పాటు పలు డిమాండ్‌లపై నవంబర్ 5న మాదిగల యుద్ధభేరి బహిరంగ సభ నిర్వహించి మాదిగల సత్తా చాటుతామన్నారు. ఈ కార్యక్రమంలో గుర్రాల శ్రీనివాస్, కోండ్ర శంకర్, చిలకమర్రి గణేష్, డప్పు శివరాజ్, మీసాల మల్లేష్, బల్గర్ హుస్సేన్, జీడి నరసింహ, కొల్లూరి వెంకట్, చింత బాబు ఆకారపు రుక్కమ్మ , పందుల సంజీవ, చినగళ్ల యాదిరితోపాటు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్ధిక సాయం అందజేత



జగదేవ్‌పూర్, అక్టోబర్ 16, మనం న్యూస్ః మండలంలోని మునిగడప గ్రామానికి చెందిన సామల దేవదాసు (50) అనారోగ్యం తో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎఫ్‌డిసి ఛైర్మన్ ప్రతాప్‌రెడ్డి మృతుని కుటుంబానికి రూ. 10 వేల ఆర్థిక సాయాన్ని ఎంపిటిసిల ఫోరం జిల్లా అధ్యక్షులు కిరణ్ గౌడ్, సర్పంచ్ బాల్‌లక్ష్మి ఐలయ్య ఆధ్వర్యంలో అందజేశారు. వారితోపాటు ఉప సర్పంచ్ కుక్కల ఆవణ్య మల్లేశం, ఏఎంసి డైరెక్టర్ చల్ల బాలకిషన్, గ్రామ అధ్యక్షులు గుర్రం సుధాకర్, పిఎసిఎస్ డైరెక్టర్ గుర్రం శ్రీనివాస్ తదితరులు ఆపల్గొన్నారు.

## టీఆర్ఎస్‌లో ఆధితప్య పోరుపై రగడ?



కొండపాక, అక్టోబర్ 16, మనం న్యూస్ః పార్టీలో మాపై నీ పెత్తనం ఏంటని దేవి రవిందర్‌ను జగదేవ్‌పూర్ వైస్ ఎంపిపి భగవాన్ ప్రశ్నించారు. పార్టీలో నీవు ఎంతో నేను అంత... మాపై నీ ఆజమాయిషీ ఏంటి... అని ప్రశ్నించాడు. కుకునూరుపల్లి మండల పరిధిలోని చిన్నకృష్ణాపురం గ్రామంలో సోమవారం ఈ సంఘటన చోటు చేసుకుంది. కుకునూరుపల్లి నూతన మండల కేంద్రంగా ఏర్పాటు కావడంతో కొండపాక నుండి కొన్ని గ్రామాలు జగదేవ్‌పూర్ నుండి కొన్ని గ్రామాలు కుకునూరుపల్లి మండల పరిధిలోకి వచ్చాయి. ఈ క్రమంలో కొండపాక మండలంలో వైస్ ఎంపిపి దేవి రవిందర్ స్వగ్రామమైన లకుడారం, జగదేవ్‌పూర్ వైస్ ఎంపిపి అయిన భగవాన్ స్వగ్రామం చిన్న కృష్ణాపురం గ్రామంలో పార్టీ కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో పాల్గొన్న ఇరు మండలాల వైస్ ఎంపిపిల మధ్య ఘర్షణ వాతావరణం చోటు చేసుకుంది. జగదేవ్‌పూర్ వైస్ ఎంపిపి మాట్లాడుతూ నీ ఒంటెద్దు పోకడను మానుకోవాలని అన్నీ నేనే చేస్తున్నానని అనడం ఏంటని ప్రశ్నించారు. సమావేశానికి ఆహ్వానించడానికి అందరికీ చెప్పకుండా నీ ఒక్కడివే చేయడమేంటని పార్టీ కార్యక్రమాలు అందరికీ సమాచారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పాల్గొన్న కార్యకర్తలు వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపి టిసిలు రెండు వర్గాలుగా విడిపోయి తోపులాట చోటు చేసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్‌డిసి ఛైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, డిసిసిబి ఛైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డిలు ఇరు వర్గాలను నచ్చజెప్పి మరోమారు ఇలాంటివి చోటు చేసుకోకుండా చూస్తామని హామీ ఇచ్చినట్లు సమాచారం.



## కాంగ్రెస్‌తోనే ప్రజలకు న్యాయం

### ప్రజలకు గ్యారంటీ పథకాల కరపత్రాల పంపిణీ

### ఎంపిపి రవిందర్ గౌడ్



జిన్నారం, అక్టోబర్ 16, మనం న్యూస్ః ప్రజలకు కాంగ్రెస్ పార్టీతోనే సరైన న్యాయం జరుగుతుందని జిన్నారం ఎంపిపి రవిందర్ గౌడ్ అన్నారు. మండలంలోని దాదిగూడెం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీ పథకాలను ఇంటింటికి కరపత్రాల రూపంలో పంపిణీ చేశారు. ఎన్నికల్లో గెలిస్తే రూ. 500లకే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.5 లక్షల వరకు ఉచిత వైద్యం అందిస్తామన్నారు. ప్రతి మహిళలకు ఆర్టీసి బస్సుల్లో ఉచిత ప్రయణాంనిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు, రైతులకు రైతుబీమా పథకం వంటివి అమలు చేస్తామన్నారు. ప్రభుత్వం ఏర్పడక ముందు ఒక మాట ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఒక మాట ఇచ్చే ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీ కాదని, ఇచ్చిన మాట తప్పకుండా నెరవేర్చే పార్టీ అన్నారు. ఈ కార్యక్రమంలో జిన్నారం మండల ఎంపిపి రవిందర్ గౌడ్, వైస్ ఎంపిపి గంగు రమేష్, ఊట్ల గ్రామ సర్పంచ్ జింకల రవిందర్, ఊట్ల గ్రామ యూత్ అధ్యక్షులు జింకల మధు, నీరుడి సాయిబాబా, గంగు భాస్కర్ , శ్రీనివాస్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులుగా గట్టు శ్రీకాంత్



దుబ్బాక, అక్టోబర్ 16, మనం న్యూస్ః దుబ్బాక మున్సిపాలిటీ పరిధిలోని ధర్మాజీపేట 9వ వార్డుకు చెందిన గట్టు శ్రీకాంత్‌ను దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్‌రెడ్డి ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులుగా నియామక పత్రం అందించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా కృషి చేస్తానన్నారు. శ్రీనివాస్‌రెడ్డి నాయకత్వంలో దుబ్బాక నియోజకవర్గ అభివృద్ధికి, వచ్చే ఎన్నికల్లో బీజేపి, బిఆర్ఎస్ పార్టీలు ఊహించని విధంగా భారీ మెజార్టీతో చెరుకు శ్రీనివాస్‌రెడ్డిని గెలిపించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ అధ్యక్షులు ఇస్తారిగల్ల మల్లేశం, దుబ్బాక మండల పార్టీ అధ్యక్షులు కొంగరి రవి మున్సిపల్ అధ్యక్షులు నర్మెట ఏసురెడ్డి, మున్సిపల్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు మాస్టర్ శ్రీకాంత్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ పార్టీకి రాజీనామా

-పార్టీ అభివృద్ధికి కష్టపడి పని చేశా

-బిఆర్ఎస్ పార్టీ నా సేవలు గుర్తించలేదు

-ప్రజాక్షేత్రంలోనే తేల్చుకుంటాం

-నీలం మధు ముదిరాజ్

పటాన్‌చెరు, అక్టోబర్ 16, మనం న్యూస్ః సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం కొత్తపల్లి గ్రామంలో ఎన్ఎంఆర్ వ్యవస్థాపక అధ్యక్షులు నీలం మధు ముదిరాజ్ తెరాస పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ ఏర్పాటు చేసిన 22 సంవత్సరాల నుండి పార్టీ కోసం ఒక సైనికుడిలా పని చేస్తూ పార్టీ అభ్యున్నతికి కృషి చేశానన్నారు. 2014లో పటాన్‌చెరు జెడ్పిటిసి అభ్యర్థిగా పోటీ చేయడానికి అభ్యర్థులు సైతం లేని సమయంలో పోటీ చేసి గట్టి పోటీ ఇవ్వడమే కాకుండా నా స్వగ్రామం





చిట్కుల్‌లో రెండు ఎంపిటిసిలను గెలిపించానని, అందులో మా అమ్మ రాధమ్మ ఉన్నారని స్పష్టం చేశారు. తర్వాత 2014, 2018 ఎన్నికల్లో బిఆర్ఎస్ అభ్యర్థి గెలుపు కోసం తనవంతు కృషి చేశానన్నారు. గత నాలుగైదేళ్లుగా నియోజకవర్గ వ్యాప్తంగా సేవా కార్యక్రమాలు నిర్వహించడమే కాకుండా పార్టీ అభ్యున్నతి కోసం ప్రభుత్వ సంక్షేమ పథకాలను విరివిగా ప్రజల్లోకి తీసుకువెళ్లానన్నారు. పార్టీ అభివృద్ధి కోసం తన ఆస్తులను సైతం అమ్మి కార్యక్రమాలు నిర్వహించానని, అయినా బిఆర్ఎస్ కనీసం తన సేవలను గుర్తించలేదన్నారు. పార్టీ కార్యక్రమాల కోసం కోట్ల రూపాయలు ఖర్చు పెట్టి ప్రచారం నిర్వహిస్తే ఓర్వలేని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి తనపై అక్రమంగా కేసులు బనాయించడమే కాకుండా తాను ఏర్పాటు చేస్తున్న ఫ్లెక్సీలను సైతం చింపివేశారని, అయినా సంయమనంతో పార్టీ అభివృద్ధి కోసం శ్రమించానని వెల్లడించారు. బహుజన జాతి బిడ్డలు చట్ట సభల్లో అడుగుపెట్టే అవకాశం వచ్చినపుడే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందన్న ఉద్దేశంతో స్వతంత్ర అభ్యర్థిగా బరిలో దిగి పోటీలో ఉంటున్నట్లు తెలిపారు. ప్రజల ఆదేశాల మేరకు తెరాస పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు పాదయాత్ర వేదికగా ఆయన ప్రకటించారు.

## సంగారెడ్డి బిఆర్ఎస్ అభ్యర్థిగా చింతా ప్రభాకర్

### సీఎం చేతుల మీదుగా బి ఫారమ్ స్వీకరణ



సంగారెడ్డి, అక్టోబర్ 16, మనం న్యూస్ః సంగారెడ్డి నియోజకవర్గం నుండి బిఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న చింతా ప్రభాకర్‌కు సోమవారం బిఆర్ఎస్ అధినేత కేసీఆర్ చేతుల మీదుగా బి ఫారమ్ అందుకున్నారు. ఈ నేపథ్యంలో బిఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు ఎమ్మెల్యే అభ్యర్థి చింతా ప్రభాకర్ కృతజ్ఞతలు తెలిపారు. సంగారెడ్డి నియోజకవర్గంలో చింతా ప్రభాకర్ ఘన విజయం సాధించాలని కేసీఆర్ ఆకాంక్షించారు. ఈనెల 15న జరిగిన సమావేశంలో చింతా ప్రభాకర్‌కు బి ఫామ్ ఇవ్వకపోవడంతో అభ్యర్థిని మారుస్తారని జోరుగా ప్రచారం జరగింది. సీఎం స్వయంగా చింతా ప్రభాకర్‌కు బి ఫామ్ ఇవ్వడంతో ఉత్కంఠకు తెరపడింది.

## ఎన్ఎంఆర్ యువసేన సభ్యులుగా కొనసాగుతాం

### నీలం మధును ఎమ్మెల్యేగా గెలిపించుకుంటాం

### సుంకరబోయిన నర్సింలు ముదిరాజ్



జిన్నారం, అక్టోబర్ 16, మనం న్యూస్ః జిన్నారం గుమ్మడి మండలం లో ఎన్ఎంఆర్ యువసేన సభ్యులు నీలం మధు వెంటనే నిలుస్తామ ని, ఆయనను ఎమ్మెల్యేగా గెలిపించుకుంటామని సుంకరబోయిన న ర్సింలు తెలిపారు. నీలం మధు ప్రజలకు చేసిన మంచి పనులను ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడం, బడుగు బలహీన వర్గాల ప్రజ లు నీలం మధుకు కుల మత భేదం లేదన్నారు. ప్రజల శ్రేయస్సు కో సం ఆయన నిరంతరం పాటుపడుతారని, చిట్కుల్ గ్రామంలో ఏకగ్రీ వంగా ఆయనను ఎన్నుకోవడం జరిగిందన్నారు. అలాగే పటాన్‌చెరు నియోజకవర్గంలో కూడా ప్రజల శ్రేయస్సు కోసం అనుదినం పోరాటం చేసిన తెలంగాణ ఉద్యమకారుడికి టికెట్ ఇవ్వని తెరాస ప్రభుత్వాన్ని ఓడించడమే లక్ష్యంగా, ఏ పార్టీ టికెట్ ఇచ్చినా ఎమ్మెల్యేగా గెలిచేది నీలం మధు అని ఎన్ఎంఆర్ యువసేన సభ్యులు తెలిపారు.

## రూరల్ మండల బిఆర్ఎస్ అధికార ప్రతినిధిగా గోపినాథ్‌రెడ్డి



సిద్దిపేట రూరల్, అక్టోబర్ 16, మనం న్యూస్ః సిద్దిపేట రూరల్ మండలం బిఆర్ఎస్ పార్టీ అధికార ప్రతినిధిగా తోర్నాల గ్రామానికి చెందిన గోపినాథ్‌రెడ్డిని నియమిస్తున్నట్లు మంత్రి హరీష్‌రావు తెలిపారు. గోపినాథ్‌రెడ్డికి నియామక పత్రాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతను నిలబెట్టుకుంటానని, పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని గోపినాథ్‌రెడ్డి తెలిపారు.

## శ్రీ సరస్వతి శిశుమందిర్ నూతన భవన నిర్మాణ భూమిపూజ



సిద్దిపేట అర్బన్, అక్టోబర్ 16, మనం న్యూస్ః విలువలతో కూడిన విద్యను అందిస్తున్న శ్రీ సరస్వతి శిశుమందిర్ నూతన భవన నిర్మాణానికి సోమవారం భూమిపూజ నిర్వహించారు. కేంద్ర విద్యా విధానానికి అనుగుణంగా రెండున్నరెకరాల విశాల స్థలంలో నూతన భవన నిర్మాణ కార్యక్రమానికి తెలంగాణ ప్రాంత సంఘటన మంత్రి శ్రీనివాస్‌రావు భూమిపూజ చేశారు.

## అలయన్స్ క్లబ్ స్నేహ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకుల పంపిణీ



సిద్దిపేట రూరల్, అక్టోబర్ 16, మనం న్యూస్ః జిల్లా కేంద్రం లోని శారదాంబ దేవాలయంలోని వేద పాఠశాల విద్యార్థులకు అలయన్స్ క్లబ్ స్నేహ కార్యదర్శులు చిప్ప మచ్చేందర్ ధర్మపత్ని పుట్టిన రోజు సందర్భంగా నిత్యావసర సరుకులను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా గవర్నర్ సోమ వనజ మాట్లాడుతూ అలయన్స్ క్లబ్ సేవలో ఎప్పుడు ముందుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ గవర్నర్ సోమ శివకుమార్ పాల్గొన్నారు.

## చింత ప్రభాకర్ భారీ మెజార్టీతో గెలవాలి

### కౌన్సిలర్ నేనావత్ శ్రీనివాస్

### సదాశివపేట నుండి తుల్జాపూర్ వరకు పాదయాత్ర



సదాశివపేట, అక్టోబర్ 16, మనం న్యూస్ః పట్టణ 22వ వార్డు కౌన్సిలర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో సోమవారం చింత ప్రభాకర్ భారీ మెజార్టీతో గెలవాలని సదాశివపేట నుండి తుల్జాపూర్ వరకు తన అనుచరులతో పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ నేనావత్ శ్రీనివాస్ మాట్లాడుతూ దుర్గమ్మ దేవాలయం వద్ద పజలు నిర్వహించి టిఎస్‌హెచ్‌డిసి ఛైర్మన్ చింతా ప్రభాకర్ చేతుల మీదుగా జెండా ఊపి పాదయాత్ర ప్రారంభించడం జరిగిందన్నారు. నిరంతరం ప్రజల్లో ఉండి ప్రజా సేవే తన ఊపిరిగా భావించే వ్యక్తి చింత ప్రభాకర్ అన్నారు. నియోజకవర్గం అభివృద్ధి చెందాలన్నా సమస్యలు తీరాలన్నా చింత ప్రభాకర్‌తోనే సాధ్యమవుతుందన్నారు. ఆయన భారీ మెజార్టీతో గెలవాలని సదాశివపేట నుండి తుల్జాపూర్ వరకు పాదయాత్ర నిర్వహిస్తున్నామన్నారు రోజుకు 40 నుండి 50 కి.మీ.ల చొప్పున శనివారం రాత్రి వరకు తుల్జాపూర్ చేరుకుంటామన్నారు. అక్కడ అమ్మవారి ఆశీస్సులు చింతా ప్రభాకర్‌కు ఉండాలనే ఉద్దేశంతో ఈ పాదయాత్ర చేపట్టడం జరిగిందన్నారు. ఈ పాదయాత్రలో నవీన్, గణేష్, వినోద్, నాగేష్, తిరుపతి, విజయ్, ఆనందం, సంతోష్ ఉన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ చింతా గోపాల్, కౌన్సిలర్లు ఇంద్రమోహన్ గౌడ్, విద్యాసాగర్‌రెడ్డి, సాతాని శ్రీశైలం, చౌదరి ప్రకాష్, కో ఆప్షన్ సభ్యులు కోడూరు అంజయ్య నాయకులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ పార్టీతోనే నియోజకవర్గ అభివృద్ధి

**-వివిధ పార్టీల నుండి బిఆర్ఎస్‌లోకి యువత చేరిక**

**-కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన ఎమ్మెల్యే అభ్యర్థి ప్రభాకర్‌రెడ్డి**



దౌల్తాబాద్, అక్టోబర్ 16, మనం న్యూస్‌: దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి సీఎం కేసీఆర్ నాయకత్వంలో జరుగుతుందని, రాష్ట్ర అభివృద్ధి పూర్తిగా బిఆర్ఎస్ పార్టీతోనే సాధ్యమవుతుందని ఎంపి, దుబ్బాక బిఆర్ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని తిరుమలాపూర్, కోనాయిపల్లి, పోసాన్‌పల్లి, బందారం గ్రామాలకు చెందిన వివిధ పార్టీల యువకులు బిఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో వివిధ గ్రామాల నుండి సుమారు 300 మంది బిఆర్ఎస్‌లో చేరగా వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా బందారం గ్రామ బీజేపి గ్రామ కమిటీ అధ్యక్షులు భూపాల్‌తో సహా పలువురు బీజేపికి రాజీనామా చేశారు. అనంతరం ఆయన



మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ప్రకటించిన మేనిఫెస్టోతో సబ్బండ వర్గాల ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నార న్నారు. రైతుబంధు, రైతుబీమా, ఆరోగ్యశ్రీ వంటి మేనిఫెస్టోలతో ప్రజలంతా సంతోషంగా ముందుకు సాగుతారని ఆకాంక్షిస్తున్నానన్నారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే రఘునందన్‌రావు గెలిచిన మూడు సంవత్సరాల్లో చెప్పిన మాటలు సద్దిమూటల్లా మారడంతో నియోజకవర్గ ప్రజలు యువత ఎమ్మెల్యేపై మండిపడుతున్నారన్నారు. మాయమాటలతో గద్దెనెక్కిన రఘునందన్‌రావుకు ఈసారి ఎన్నికల్లో ప్రజలే తగిన బుద్ధి చెప్తారన్నారు. దుబ్బాక ఎమ్మెల్యేగా తనను గెలిపించి ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేస్తున్నానన్నారు. అంతకుముందు జనార్ధన్‌రెడ్డి నూతనంగా ఏర్పాటు చేసిన ఏసి కన్వెన్షన్‌లో ప్రత్యేక పూజలనున రాష్ట్ర నాయకులు సోలిపేట సతీష్‌రెడ్డితో కలిసి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు రణం శ్రీనివాస్ గౌడ్, జిల్లా కో ఆప్షన్ రహీమొద్దీన్, వైస్ ఎంపిపి అల్లి శేఖర్‌రెడ్డి, మాజీ ఏఎంసి ఛైర్మన్ శ్రీనివాస్ గుప్త, పిఏసిఎస్ ఛైర్మన్ వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల నియమావళి ఉల్లంఘనపై కల్వేర్ ఇంచార్జ్ ఎంపిడిఓపై సస్పెన్షన్ వేటు

**సంగారెడ్డి జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్**



సంగారెడ్డి, అక్టోబర్ 16, మనం న్యూస్‌: ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఉల్లంఘించిన కల్హేర్ సూపరిండెంట్, ఇంచార్జ్ ఎంపిడిఓ సంగ్రామ్‌ను సస్పెండ్ చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ శరత్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ ఉల్లంఘించినట్లు తమ దృష్టికి రావడంతో విచారణ చేసి సంబంధితుని నుండి సంజాయిషీ తీసుకోవడం జరిగిందన్నారు. అట్టి సంజాయిషీ సమంజసంగా సంతృప్తికరంగా లేనందున సంగ్రామ్‌ను విధుల నుండి సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## కోర్టుకు హజరైన పొన్నం, బొమ్మ

**నాడు ఒకే పార్టీ నేడు ప్రత్యర్థులయ్యే చాన్స్**



హుస్నాబాద్,అక్టోబర్ 16,(మనం న్యూస్): గౌరవెల్లి భూనిర్వాసి తులకు అండగా నిలిచిన ప్రతిపక్ష నాయకుల పై పోలీసులు కేసులు పెట్టారు. నాడు కాంగ్రెస్ లో ఉన్న ఇద్దరూ నేతలతో పాటు తదితర నాయకుల పై పోలీసులు అక్రమ కేసులు పెట్టడంతో హుస్నాబాద్ కోర్టులో సోమవారం ఏ1 నిందితుడిగా ఉన్న కరీంనగర్ మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ గౌడ్, ఏ2 నిందితుడిగా ఉన్న రాష్ట్ర హౌజ్‌ఫెడ్ మాజీ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తిలు మెజిస్ట్రేట్ ముందు హజరయ్యారు. వీరిద్దరూ కలిసి ఒకేసారి కోర్టులో హజరవ్వడంతో ప్రజల్లో ఓ చర్చ మొదలైంది. ఒకే పార్టీలో ఉన్న వీళ్లిద్దరూ నాడు మిత్రులుగా ఉంటే త్వరలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రత్యర్థులుగా మారే అవకాశం లేకపోలేదంటూ చర్చ జరుగుతుంది.



## సంగారెడ్డిలో నూతన షాపింగ్‌మాల్ ప్రారంభం

**ప్రముఖ నటి అనుపమ పరమేశ్వరన్ సందడి**

**భారీ ట్రాఫిక్‌జామ్‌తో వాహనదారుల ఇబ్బందులు**

సంగారెడ్డి, అక్టోబర్ 16, మనం న్యూస్‌: సంగారెడ్డి పట్టణంలో సినీ హీరోయిన అనుపమ పరమేశ్వరన్ సోమవారం సందడి చేశారు. పట్టణంలో ఏర్పాటు చేసిన చందన బ్రదర్స్ షో రూమ్‌ను ఆమె ప్రారంభించారు. ఈ నేపథ్యంలో ట్రాఫిక్ జామ్ కావడం వల్ల వాహనదారులు తీవ్ర అవస్థలు పడ్డారు. ముఖ్యంగా షాపింగ్ మాల్ ప్రారంభోత్సవ సందర్భాల్లో రోడ్లపై ట్రాఫిక్ జామ్ అవడం సర్వసాధారణంగా మారింది. వాహనం రోడ్డు పక్కన పెడితే ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతుందని పోలీసులు వచ్చి వాహనం తీసివేయాలని చెబుతుంటారు. అదే షాపింగ్‌మాల్ ప్రారంభోత్సవంలో నిర్వాహకుల హడావిడి రోడ్డుపైనే ఉంటుంది. దీంతో రోడ్డుకు ఇరువైపులా వాహనాలు నిలిచిపోవడం చూస్తుంటా ఆ సందర్భంలో ట్రాఫిక్ పోలీసుల వైఖరి పట్ల అనేక ప్రశ్నలు తావిస్తోంది. సోమవారం పట్టణంలోని ప్రధాన రోడ్డు పక్కన రెడ్‌లాస్ హోటల్ ఎదురుగా ఏర్పాటు చేసిన నూతన షాపింగ్ మాల్‌ను ప్రముఖ సినీ నటి అనుపమ పరమేశ్వరన్ ప్రారంభించారు. దీంతో అనుపమ పరమేశ్వరన్‌ను చూసేందుకు ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా నిర్వాహకులు చేసిన హడావిడి కారణంగా ప్రధాన రోడ్డుపై ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. వివిధ పనుల నిమిత్తం వెళ్లేవారు ఉద్యోగాలకు వెళ్లేవారు తీవ్ర అవస్థలు పడ్డారు. దీంతో పోలీసులపై, షాపింగ్‌మాల్ నిర్వాహకులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

## పటిష్ట బందోబస్తు

**దిశా నిర్ధేశం చేసిన సిపి**



సిద్దిపేట, అక్టోబర్ 16, మనం న్యూస్ ప్రతినిధిః తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజా ఆశీర్వాద బహిరంగ సభ సిద్దిపేటలోని నాగదేవత ఆలయం వద్ద నిర్వహించనున్న నేపథ్యంలో పోలీస్ కమీషనర్ శ్వేత అధికారులకు దిశానిర్ధేశం చేశారు. సోమవారం పోలీస్ అధికారులు, సిబ్బందికి ఏర్పాటు చేయాల్సిన బందోబస్తు గురించి వివరించారు. పార్కింగ్ ప్రదేశం, హెలిప్యాడ్ ప్రాంతాలను అధికారులతో కలిసి సందర్శించి పలు సూచనలు చేశారు. అడిషనల్ డిసిపిలు, ఏసిపిలు, సిఐలు, ఎస్ఐలు, పోలీస్ సిబ్బందితో ఆరు సెక్టార్లుగా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మధ్యాహ్నం 1 గంట నుండి సాయంత్రం 7:30 గంటల వరకు సభ జరిగే ప్రాంతంలో ట్రాఫిక్ డైవర్షన్ చేయడం జరుగుతుందన్నారు. వాహనదారులు ట్రాఫిక్ డైవర్షన్‌కు అనుగుణంగా వాహనాలు మళ్లించాలన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ డిసిపిలు అందె శ్రీనివాస్‌రావు, ఎస్. మల్లారెడ్డి, రాంచందర్‌రావు, సుభాష్‌చంద్రబోస్, ఏసిపిలు సురేందర్‌రెడ్డి, రమేష్, సిఐలు, ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

